తెలంగాణ అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళి

ధర్మారం: రామయ్యపల్లిలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గోదావరిఖని: కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

ధర్మారం, జూన్ 1: రామయ్యపల్లి గ్రామంలో శనివారం రాత్రి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా తొలి సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఇచ్చిన పిలుపు మేరకు జెండా గద్దె వద్ద పార్టీ నాయకులు అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు మార్క బాలయ్య, నాయకులు మూల మల్లేశం, వేల్పుల దామోదర్, మార్క రమేశ్, పల్లె అభిలాశ్, ఉయ్యాల సంజీవ్, ఉయ్యాల రవి, కొండపర్తి కొమురయ్య, కొండపర్తి లచ్చయ్య, సముద్రాల తిరుపతి, మార్క శంకరయ్య, కొండపర్తి ఓదెలు, మార్క మల్లయ్య, శ్రీపతి రాజయ్య, పల్లె ఓదెలు పాల్గొన్నారు.

అమరులకు టీబీజీకేఎస్ ఘన నివాళి

గోదావరిఖని, జూన్ 1: తెలంగాణ అమరవీరులకు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం శనివారం రాత్రి గోదావరిఖనిలో కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు. స్థానిక టీబీజీకేఎస్ కార్యాలయం నుంచి చౌరస్తాలోని అమరవీరుల స్మారక స్తూపం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి మాట్లాడుతూ, దశాబ్దాల తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు ఎంతో మంది త్యాగాల ఫలితం వలన తెలంగాణ ఏర్పాటు జరిగిందన్నారు. ఇక్కడ నాయకులు నూనె కొమురయ్య, మాదాసి రామమూర్తి, నాగేల్లి సాంబయ్య, వడ్డెపల్లి శంకర్, ఎల్ వెంకటేశ్, చేల్పూరి సతీశ్, చల్ల రవీందర్‌రెడ్డి, సత్యనారాయణ, వాసర్ల జోసెఫ్, పోలాడి శ్రీనివాసరావు, చిలకలపల్లి శ్రీనివాస్, రాజేశం కొండ్ర అంజయ్య, పులిపాక శంకర్, తదితరులున్నారు.

ఆరోపణలు మాని.. అభివృద్ధిపై దృష్టి సారించండి

- **కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ నాయకుల హితవు**

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కమాన్‌పూర్, జూన్ 1 : ప్రతిపక్ష నేతలపై కాంగ్రెస్ నాయకులు అర్థరహిత విమర్శలు చేయడం మానుకొని అభివృద్ధిపై దృష్టి సారించాలని బీఆర్ఎస్ నాయకులు హితవు పలికారు. మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పెద్దపల్లి–మంథని ప్రధాన రహదారిలో రామగిరి మండలంలో ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేయడం సరికాదన్నారు. బడుగు, బలహీనవర్గాల ప్రజలు ఉపాధి కల్పన కోసం ఏర్పాటు చేసుకున్నారని, వారికి నోటీసులు ఇచ్చి మార్కింగ్‌చేస్తే వారే తొలగించేవారన్నారు. అలా చేయకుండా జేసీబీలతో మనుషులు ఉండగానే కూలగొట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అదే అగ్రవర్ణాలకు చెందిన వారివైతే కూలగొట్టెవారా అని ప్రశ్నించారు. కొందరు కాంగ్రెస్ నాయకులు జడ్పీ చైర్మన్ పుట్ట మధుపై అవాకులు, చెవాకులు మాట్లాడుతున్నారని మరోమారు అర్థరహిత విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. కోర్టు పరిధిలో ఉన్న విషయాలను పదే పదే ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మరోమారు చౌకబారు ఆరోపణలు చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదన్నారు. డా.బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతి రావు పూలేతో పాటు మహనీయుల స్ఫూర్తితో జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ బడుగు, బలహీన వర్గాల ప్రజల హక్కుల కోసం, అభ్యున్నతి కోసం పాటుపడుతున్నాడని అన్నారు. కాంగ్రెస్ అడ్డాగా పేరొందిన మంథని అసెంబ్లీ గడ్డపై గెలిచిన ఒకే ఒక బీసీ బిడ్డ అనే విషయాన్ని విస్మరించవద్దన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ మేకల సంపత్, నాయకులు బొమ్మగాని అనిల్‌గౌడ్, పొన్నం రాజేశ్వరి, కొట్టె భూమయ్య, గుర్రం లక్ష్మీమల్లు, తాటికొండ శంకర్, కొండ వెంకటేశ్, నీలం శ్రీనివాస్, ఆకుల రమేశ్, సుధాకర్, తోట రాజ్‌కుమార్, రామ్మూర్తి, శ్రీనివాస్‌లున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327724-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

అక్రమ కట్టడాల పేరుతో విధ్వంసం తగదు

రామగిరి, జూన్ 1 : అక్రమ కట్టడాల పేరుతో విధ్వంసం సృష్టించవద్దని, ఇండ్లు కూలిస్తే అధికారం చేతులు మారగానే మీ ఇండ్లు కూలుతాయని నాగెపల్లి మాజీ సర్పంచ్ కొండవేన ఓదెలు, మండల బీఆర్ఎస్ నాయకులు గద్దల శంకర్, వేగోలపు శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం నాగెపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణి కోయిదాలో అక్రమంగా కట్టారని అంటున్న కాంగ్రెస్ నాయకుడి ఇల్లు ఆ పక్కనే అదే సింగరేణి మిగులు భూమి అయిన కోయిదాలో ఉందనే విషయం గుర్తెరగాలని హితవు పలికారు. ఎవరు మతిభ్రమించి మాట్లాడుతున్నారో ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. బీసీల కోసం పరితపిస్తున్న నాయకుడికి అండగా నిలవాల్సింది పోయి వెన్నుపోటు పొడవడమే కాక, విమర్శలు చేయడాన్ని బీసీ సమాజం క్షమించదని తెలిపారు.

సారా విక్రేత అరెస్ట్

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 1 : గోదావరిఖని ఎక్సైజ్ అధికారులు నాటుసారా విక్రయిస్తున్న కోరమాన్యను శనివారం అరెస్ట్ చేశారు. జిల్లా ఎక్సైజ్ అధికారి మహిపాల్ రెడ్డి ఆదేశాల మేరకు రామగుండం ఎక్సైజ్ సీఐ సీహెచ్ మంగమ్మ ఆధ్వర్యంలో పట్టణంలో తనిఖీలు నిర్వహించారు. బైక్‌పై నాలుగు లీటర్ల నాటుసారాను తీసుకెళ్తున్న కోరమాన్యాన్ని అదుపులోకి తీసుకున్నారు.

జ్యోతినగర్ : టౌన్‌షిప్‌లోని అభయంజనేయస్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న ఆలయ పూజారి శ్రీకాంత్ శర్మ

సుల్తానాబాద్‌రూరల్ : హనుమాన్ జయంతిలో హోమంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా హనుమాన్ జయంత్యుత్సవాలు

ఊరూరా ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం హనుమాన్ జయంత్యుత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కొండగట్టులో ఆంజనేయస్వామిని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. సుల్తానాబాద్ రూరల్ మండలం సుద్దాలలోని శివాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు కాసర్ల అనంతరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావు పాల్గొన్నారు. ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో ఎన్టీపీసీ జీఎం వేముల అనిల్‌కుమార్, డీజీఎం సుధాకర్, భక్తులు హోమంలో పాల్గొన్నారు.

-పెద్దపల్లి టౌన్/ఓదెల/కాల్వశ్రీరాంపూర్/సుల్తానాబాద్ రూరల్/జ్యోతినగర్/కోల్‌సిటీ/మంథని, జూన్ 1

కోల్‌సిటీ : గోదావరిఖనిలోని శ్రీ కోదండ రామాలయంలో వేడుకల్లో హనుమాన్ మాలధారులు

కాల్వశ్రీరాంపూర్: పెగడపల్లిలో హోమాలు చేస్తున్న గ్రామస్తులు

ఓదెల: అన్నదానంలో పాల్గొన్న భక్తులు

వానకాలం పంటకు సమృద్ధిగా విత్తనాలు

- **కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్**

మాట్లాడుతున్న కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

పెద్దపల్లి, జూన్ 1: రాబోయే వానకాలం పంట సీజన్‌కు జిల్లాలో సమృద్ధిగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అన్ని రకాల పంటలకు సంబంధించి విత్తనాల స్టాక్ డీలర్ల వద్ద ఉందని, రైతులు అనవసరపు ఆందోళనలు చెందవద్దని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. శనివారం ఆయన సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులకు సందేహాలుంటే కాల్ సెంటర్ నెంబర్ 9573951060 ఫోన్ చేయాలని కలెక్టర్ కోరారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ, కల్తీ విత్తనాలను ఆరికట్టేందుకు పోలీసు యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పెద్దపల్లి, జూన్ 1: రాబోయే వానకాలంలో జిల్లాలో సీజనల్ సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ ఆదేశించారు. శనివారం కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాబోయే వానకాలం సీజనల్ సమస్యల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాబోయే వానకాలంలో విపత్తులను ఎదుర్కొనేందుకు పంచాయతీలు, మున్సిపాలిటీలు సన్నద్ధం కావాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి ప్రమోద్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి ఆశా లత, డీఆర్డీవో రవీందర్, ఎంపీడీవోలు, అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఆన్‌లైన్‌లో కౌంటింగ్ వివరాలు..

పెద్దపల్లి, జూన్ 1: పకడ్బందీగా ఆన్‌లైన్ ఎన్‌కోర్ వెబ్‌సైట్‌లో కౌంటింగ్ వివరాలను నమోదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సూచించారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఆన్‌లైన్ ఎన్‌కోర్ వెబ్‌సైట్‌లో కౌంటింగ్ వివరాల నమోదు ప్రక్రియపై సంబంధిత కౌంటింగ్ ఆపరేటర్లతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ ఫలితాలు సకాలంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు భారత ఎన్నికల కమిషన్ ఎన్‌కోర్ వెబ్‌సైట్ వ్యవస్థ ప్రవేశ పెట్టిందన్నారు. కౌంటింగ్ రోజు ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఉన్న 14 టేబుళ్ల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు నలుగురు కంప్యూటర్ ఆపరేటర్లను నియమిస్తామన్నారు. ఈవీఎం ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వివరాలను నమోదు అనంతరం రిటర్నింగ్ అధికారి కౌంటింగ్ పరిశీలకులతో కలిసి పరిశీలించి తుది ఎన్నికల ఫలితాలను ప్రకటించడం జరుగుతుందన్నారు.

అతడి కళ్లు సజీవం

- **వృద్ధాప్యంతో సింగరేణి రిటైర్డు కార్మికుడు మృతి**

కమాన్‌పూర్, జూన్ 1 : మండలంలోని జూలపల్లికి చెందిన సింగరేణి రిటైర్డు ఉద్యోగి బుద్దుల ఐలయ్య (85) శుక్రవారం వృద్ధాప్యంతో మృతి చెందాడు. ఐలయ్య నేత్రాలను దానం చేస్తే ఇద్దరు అంధులకు చూపు ను ప్రసాదించవచ్చని కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, సదాశయ ఫౌండేషన్ జాతీ య గౌరవాధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి అవగాహన కల్పించారు. స్పందించిన కుటుంబ సభ్యులు ఐలయ్య నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. సేకరించిన నేత్రాలను హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంకుకు తరలించారు. ఇంటి పెద్దను కోల్పోయిన విషాదంలో కూడా ఇద్దరు అంధులకు వెలుగులు ప్రసాదించడానికి నేత్రదానం చేసిన ఐలయ్య కుటుంబ సభ్యులను లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కార్యదర్శి నల్లవెల్లి శంకర్, సదాశయ ఫౌండేషన్ బాధ్యులు అభినందించారు.

ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి

మంథని, జూన్ 1: ఫెర్టిలైజర్స్, ఎరువుల దుకాణాదారులు ఎమ్మార్పీ ధరలకు మించి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి దోమ ఆదిరెడ్డి హెచ్చరించారు. మంథనిలోని ఫెర్టిలైజర్స్, విత్తన దుకాణాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లో ఉన్న స్టాక్ వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు ఇన్వాయిస్‌లను పరిశీలించారు. విత్తనాలు, మందులను ఎమ్మార్పీ ధరలకు మించి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట వ్యవసాయాధికారులు, సిబ్బంది ఉన్నారు.

గుండెపోటుతో పీహెచ్‌సీ యూడీసీ మృతి

ఓదెల, జూన్ 1: ఓదెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో యూడీసీగా పనిచేస్తున్న అనీసుద్దీన్ శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందినట్లు దవాఖాన సిబ్బంది తెలిపారు. ఓదెలలోని పీహెచ్‌సీలో యూడీసీగా విధులు నిర్వర్తిస్తున్నాడు. అనీసుద్దీన్ స్వగ్రామమైన మంచిర్యాలలో రాత్రివేళ చాతిలో నొప్పిగా ఉన్నట్లు తెలుపడంతో కుటుంబ సభ్యులు దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందినట్లు పేర్కొన్నారు. యూడీసీ మృతిపై డాక్టర్ షెహబాజ్‌ఖాన్, ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

ఫర్టిలైజర్‌సిటీ, జూన్ 1 : సత్వర న్యాయం కోసం ఈనెల 8న జరిగే జాతీ య లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం అదన పు జిల్లా న్యాయస్థాన ఆవరణలో జరిగిన లోక్ అదాలత్ సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. లోక్ అదాలత్‌ల తో సత్వర న్యాయం సాధ్యపడుతుందన్నారు. ఇక్కడ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి మంజుల, రెండో ఆదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ వెంకటేశ్ దుర్వ, ఏపీపీలు కంది రవీందర్, నహీదా ఫర్హాన్, గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్, సీఐలు ఇంద్రసేనారెడ్డి, అజయ్‌బాబు, రవీందర్, ఎస్ఐలు, కోర్టు సిబ్బంది ఉన్నారు.

ఆవిర్భావ వేడుకలు కనుల పండువలా నిర్వహించాలి

- **ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్**

గోదావరిఖని, జూన్ 1: తెలంగాణ ఆవిర్భావ వేడుకలను కనుల పండువగా నిర్వహించాలని సింగరేణి ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. నేడు సింగరేణి ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లను జీఎం శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాయంత్రం స్టేడియంలో ఫుడ్‌కోర్ట్ స్టాళ్లు, కళాకారులతో ధూంధాం, కల్చరల్ షో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ వేడుకల విజయవంతానికి కృషి చేయాలన్నారు. ఇక్కడ ఏరియా ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్, ఏజీఎం పర్సనల్ సీహెచ్ లక్ష్మీనారాయణ, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, డీజీఎం సివిల్ వరప్రసాద్, ప్రభాకర్, ఏరియా వర్క్‌షాప్ డీజీఎం జితేందర్ సింగ్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ బంగారు సారంగపాణి, తదితరులున్నారు.

సింగరేణి ఆర్జీ–1 పరిధిలో ఇద్దరు ఉత్తమ ఉద్యోగులుగా సింగరేణి యాజమాన్యం శనివారం ప్రకటించింది. జీడీకే 1 ఇంక్లైన్ ఎస్‌డీఎల్ అండ్ హెచ్‌డీ ఆపరేటర్ సామిళ్ల రాజేశం ఏరియా వర్క్‌షాప్ ఫిట్టర్ నాంపెల్లి జగన్‌మోహన్‌గా పేర్కొన్న యాజమాన్యం నేడు ఆదివారం జవహర్‌లాల్ నెహ్రూస్టేడియంలో జరుగనున్న తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ ఉత్తమ ఉద్యోగులను సన్మానించనున్నారు.

ఆర్జీ–3లో సర్వం సిద్ధం

రామగిరి, జూన్ 1 : తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు సింగరేణి ఆర్జీ–3 ఏరియాను సర్వం సిద్ధం చేసినట్లు జీఎం సుధాకర్ రావు తెలిపారు. ఉదయం 9 గంటలకు జాతీయ పతాకావిష్కరణ, 9.15 గంటలకు జీఎం కార్యాలయం నుంచి రాణీ రుద్రమదేవి స్టేడియం వరకు తెలంగాణ రన్, 10 గంటలకు రాణీ రుద్రమదేవి స్టేడియంలో తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద పూలతో నివాళులర్పించడం జరుగుతుందన్నారు. వేడుకల్లో అన్ని వర్గాల ప్రజలు హాజరుకావాలని కోరారు.

గ్యాస్ పైపులైను నిర్మాణంతో అభివృద్ధికి విఘాతం

కోల్‌సిటీ, జూన్ 1 : రామగుండం కార్పొరేషన్‌లో ఇండియన్ గ్యాస్ పైపులైను నిర్మాణం కోసం రోడ్లను ధ్వంసం చేస్తూ అభివృద్ధికి విఘాతం కలిగిస్తున్నారని 25వ డివిజన్ కార్పొరేటర్ నగునూరి సుమలత రాజు ఆరోపించారు. పైపులైనుకు సంబంధించి సరియైన ఇంజినీర్లు లేక మంచినీటి పైపులైన్లు, డ్రైనేజీ పైపులైన్లను పూర్తిగా ధ్వంసం చేస్తూ ప్రజా జీవనానికి అవరోధాలు కలిగిస్తున్నారని అన్నారు. గ్యాస్ పైపులైను సంబంధించిన వారికి అధికార పార్టీ నాయకులు కొంతమంది కలిసి అనుమతి ఇస్తున్నారని పేర్కొన్నారు. రామగుండం కార్పొరేషన్‌లో మాత్రం ఇష్టారాజ్యంగా అనుమతి ఇస్తున్నారని పేర్కొన్నారు. దీని వల్ల ప్రజలను నీటి కొరత వెంటాడుతుందన్నారు. పదేళ్ల క్రితం ట్యాంకర్ల దగ్గరకు మంచినీటి బిందెలతో కాలినడకన వెళ్లిన పరిస్థితి రామగుండం కార్పొరేషన్ మళ్లీ వస్తుందన్నారు. సదరు ఏజెన్సీ అనుమతులను రద్దుచేసి అభివృద్ధికి విఘాతం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

11వ గనిలో ప్రమాదం.. కార్మికుడి కాలుకు గాయం

గోదావరిఖని, జూన్ 1: ఆర్జీ–1 పరిధి జీడీకే 11 గనిలో శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో బదిలీ వర్కర్ రియాజ్ గాయపడ్డాడు. కంటిన్యూస్‌మైనర్ సెక్షన్‌లో పనిచేస్తుండగా కాలుకు ఇనుపరాడ్డు తాకడంతో తీవ్ర గాయమైంది. వెంటనే గోదావరిఖని సింగరేణి ఏరియా దవాఖానకు తరలించగా చికిత్స పొందుతున్నాడు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. రియాజ్‌ను ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ దవాఖానకు వెళ్లి పరామర్శించారు. రెండ్రోజుల క్రితం ఇదే గనిలో జరిగిన ప్రమాదంలో ఆపరేటర్ ప్రతాప్ మృతి చెందాడు.

వేధింపులు భరించలేక..

- **ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య**

మంథని, జూన్ 1: తన దగ్గర ఉన్న ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పెడతానని ఓ వ్యక్తి వేధింపులు భరించలేక వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. మంథని మండలం ఖానాపూర్‌లో శనివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గారెపల్లికి చెందిన మామిడి సమ్మక్క తన రెండో కూతురైన పర్శవేన కళ్యాణి(28)ని మంథని మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన పర్శవేన శంకర్‌కు ఇచ్చి 2013 వివాహం చేశారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉండగా మంథనిలోని ఎరుకులగూడెంలో అద్దె ఇంటిలో ఐదేళ్లుగా నివసిస్తున్నారు. కళ్యాణికి కోటపర్తి రవి శ్యామ్ అనే యువకుడు ఫోన్ ద్వారా పరిచయమ్యాడు. ఈ క్రమంలో తనకు డబ్బులు ఇవ్వాలని, తనతో జీవితాంతం ఉండాలని, లేకుంటే వీడియోలు, ఫొటోలను సోషల్ మీడియాలో పెడుతానని కళ్యాణిని బెదిరించాడు. ఈ విషయమై గతంలో పెద్దల సమక్షంలో ఒకరి జోలికి ఒకరు రావద్దని ఒప్పంద పత్రం రాయించుకున్నారు. కాగా, మళ్లీ వారం రోజులుగా కోటపర్తి రవి శ్యామ్ కళ్యాణిని తనతో బయటికి రావాలని లేదంటే ఫొటోలు, వీడియోలు బయట పెడుతానని బెదిరింపులకు గురిచేస్తున్నాడు. ఈ విషయం తెలిసిన అత్త రాజమ్మ, భర్త శంకర్ పట్టించుకోకపోవడం, రవిశ్యామ్ వేధింపులు ఆపకపోవడంతో కళ్యాణి మనస్తాపానికి గురై శనివారం తెల్లవారుజామున ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి మామిడి సమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పార్వతీ బ్యారేజీ సందర్శన

బ్యారేజీని పరిశీలిస్తున్న నిపుణుల కమిటీ సభ్యులు

మంథని రూరల్, జూన్ 1: పెద్దపల్లి జిల్లా మంథని మండలం సిరిపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పార్వతీ బ్యారేజీని శనివారం నిపుణులు పరిశీలించారు. ఈ సందర్భంగా బ్యారేజీ దిగువ భాగంలో గేట్లను, పీయర్స్‌ను పరిశీలించారు. ఈఎన్సీ అనిల్‌కుమార్ నేతృత్వంలో రిటైర్డ్ ఈఎన్సీ, మెకానికల్ అడ్వైజర్ సత్యనారాయణ, ఓయూ ప్రొఫెసర్ రాజశేఖర్, వరంగల్ నీట్ ప్రొఫెసర్ రమణమూర్తి బ్యారేజీని సందర్శించి పలు వివరాలు సేకరించారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

పారిశుధ్య కార్మికురాలిని సన్మానిస్తున్న కమిషనర్, ఇతర అధికారులు

కోల్‌సిటీ, జూన్ 1 : ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ అన్నారు. కార్పొరేషన్ పారిశుధ్య విభాగంలో పబ్లిక్ హెల్త్ వర్కర్లుగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన పర్శ బతుకమ్మ, రాసకట్ల వెంకటమ్మల వీడ్కోలు సమావేశం శనివారం కార్యాలయంలో నిర్వహించారు. పదవీ విరమణ పొందిన బతుకమ్మను సన్మానించారు. మరో ఉద్యోగి రాసకట్ల వెంకటమ్మ అనారోగ్య కారణాలతో రానందున ఆమె కుటుంబ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్ రావు, అసిస్టెంట్ కమిషనర్ రాయలింగు, సూపరింటెండెంట్ మనోహర్, వర్కర్స్ యూనియన్ నాయకులు యాకయ్య, మురళీధర్ రావు, మంథని లింగయ్య, రాయమల్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తో కలిసి పనిచేసినా సమస్యలపై పోరాడుతూనే ఉంటాం

- **సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు**

గోదావరిఖని, జూన్ 1: కాంగ్రెస్‌తో కలిసి పనిచేసినా ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉంటామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. శనివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని జరిగిన ఏఐటీయూసీ కేంద్ర కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రం, దేశంలో బీజేపీ అత్యంత ప్రమాదకారి అని, అందువల్లనే కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్నామన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ కూడా ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ఎన్నికల్లో మోదీ ముస్లింల విద్వేషం రెచ్చగొట్టి హిందూ పేరుమీద గెలువాలని ప్రచారం చేశారన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని, ఎలాంటి తప్పులు చేసినా తాము ఎప్పటికప్పుడు వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. అంతకుముందు యూనియన్ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికులు సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీని గెలిపించారన్నారు. ఇక్కడ యూనియన్ అధ్యక్షుడు వీ సీతార